కాటారం : కొత్తపల్లిలో వృద్ధురాలి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ములుగురూరల్ : మల్లంపల్లి గ్రామ సభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ములుగురూరల్ : జంగాలపల్లి గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

భూపాలపల్లి రూరల్ : జంగేడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మల్హర్ : కొండంపేటలో జాబితాలో అనర్హుల పేర్లు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గందరగోళంగా గ్రామసభలు

- అధికారులను నిలదీసిన గ్రామస్తులు
- సమాధానం చెప్పలేక మౌనం
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చిట్యాల : జడలపేట గ్రామంలో గందరగోళం చేసున్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి : పోతుగల్‌లో అధికారుల తీరు పై ప్రజల ఆగ్రహం

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, జనవరి 22 : ములుగు, భూపాలపల్లి జిల్లాల వ్యాప్తంగా గ్రామసభలు గందరగోళంగా జరుగుతున్నాయి. చాలా చోట్ల అనర్హులను ఎంపిక చేశారని, అర్హులను గల్లంతు చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. ములుగు జిల్లా ములుగు మండలంలో బుధవారం జరిగిన గ్రామసభల్లో అధికారులకు చుక్కెదురైంది. జాకారం, జంగాలపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో సభ ప్రారంభంలో లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించగా అసలైన వారు కాకుండా కాంగ్రెస్ నాయకుల కుటుంబ సభ్యులు, అనుచరుల పేర్లను మాత్రమే చదివారని, పేదల పేర్లను గల్లంతు చేశారని మండిపడి అధికారులను నిలదీశారు. మల్లంపల్లిలో సభ ప్రారంభమైన రెండు గంటల అనంతరం గ్రామస్తులంతా అధికారుల తీరు, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇంటి దారి పట్టారు. జంగాలపల్లిలో ఇండ్ల మంజూరీపై అధికారులను నిలదీశారు. దీంతో చేసేది ఏమి లేక అధికారులు మౌనం పాటించారు. ప్రతి గ్రామ సభలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం మండలంలోని షాపల్లి, శివ్వాపూర్, శంకరాజుపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. షాపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పేర్లు ప్రకటించాలని మహిళలు, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాదిరి రాంబాబు డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సద్దుమణిగింది. ఇండ్లు లేని వారికి ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చేందుకు జాబితా ముందుగానే సిద్ధం చేశారని ఆరోపించారు. శంకరాజుపల్లి లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అర్హులైన వారికి ఆత్మీయ భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవోకు మార్, ఏవో వేణుగోపాల్, డీటీ వర్మ, ఏపీవో చరణ్ రాజ్ పాల్గొన్నారు. కన్నాయిగూడెం మం డలంలోని ముప్పనపల్లి, చింతగూడెం, కంతనపల్లి, సర్వాయిలో గ్రామ సభలను నిర్వహిస్తున్న అధికారులను ప్రజలు నిలదీశారు. రోజంతా నిర్వహించకుండా ఉదయం రెండు, సాయంత్రం రెండు జీపీల్లో గ్రామ సభను మొక్కుబడిగా నిర్వహించారని ఆరోపించారు. ముప్పనపల్లిలో లబ్ధిదారుల లిస్టును ఇంటి పేరు లేకుండా చదువుతుండడంతో గ్రామస్తులు నిలదీశారు.మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వనిత, ఎంపీవో సాజిదాబేగం, డీఈ శరత్ పాల్గొన్నారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం,అంబట్‌పల్లి, పెద్దంపేట, బొమ్మాపూర్, మెట్‌పల్లిలో గ్రామ సభలు గందరగోళంగా మారాయి. కాళేశ్వరంలో నిర్వహించిన సభ రసాభాసగా సాగింది. పథకాల జాబితాలో తమ పేర్లు గల్లంతయ్యాయని ప్రజలు వాగ్వాదానికి దిగారు. అంబట్‌పల్లిలో నిర్వహించిన గ్రామ సభకు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లద్ రాథోడ్, ఎంపీవో ప్రసాద్ పాల్గొన్నారు. మల్హర్ మండలంలోని కొయ్యూర్, కొండంపేట, ఎడ్లపల్లి, ఆన్‌సాన్‌పల్లి, మల్లంపల్లిలో గ్రామ సభలు నిర్వహించారు. కొండంపేట, కొయ్యూర్ గ్రామాల్లో అనర్హులను ఎంపిక చేశారని అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లంపల్లి గ్రామ సభలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొని జాబితాలో పేరు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు. చిట్యాల మండలం జడల్‌పేట, కైలాపూర్, తిరుమలాపూర్‌లో గ్రామ సభలు గందరగోళంగా జరిగాయి. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో గుడిసెలో ఉండే వారి పేర్లు కాకుండా స్లాబ్ ఇండ్లు కలిగిన వారి పేర్లు ఉన్నాయని ఆరోపించారు. రీ సర్వే జరిపించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కైలాపూర్ గ్రామసభలో తాత సమ్మక్క, కొడారి రాధ డిమాండ్ చేశారు. అలాగే, జలపేట గ్రామ సభలో జాబితా తప్పుల తడకగా ఉందని గ్రామస్తులు గందరగోళం సృష్టించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, ఆర్‌ఐ రాజు పాల్గొన్నారు. కాటారం మండలంలోని కొత్తపల్లి, చిదినెపల్లి, ధన్వాడ, ఒడిపిలవంచ, గంగారం, దామెరకుంట్లలో అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నరేశ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న, ఆర్‌ఐ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, కరుణాకర్, కృష్ణవేణి, శ్రీనివాస్, రాజశేఖర్, కుమారస్వామి, రాకేశ్ పాల్గొన్నారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంతోపాటు పోతుగల్ గ్రామ సభల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అనర్హులను ఎంపిక చేశారని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తాం

సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కాటారం మండలంలోని కొత్తపల్లి, ధన్వాడలో జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని కలెక్టర్‌తో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ పేర్లు లేని ప్రజలు దరఖాస్తులు ఇవ్వడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీఆర్డీవో నరేశ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కాగా, భూపాలపల్లి మున్సిపల్ 14వ వార్డు జంగేడు, 12, 13వ వార్డు కాసీంపల్లి, భూపాలపల్లి రూరల్ మండలం గొర్లవేడు, గణపురం మండలంలోని గాంధీనగర్, మైలారం, రేగొండ మండలం పోచంపల్లి, చిట్యాల మండలం తిరుమలాపూర్, టేకుమట్ల మండలం అంకుశంపూర్, మొగుళ్లపల్లి మండలం పిడిసిల్లలో నిర్వహించిన గ్రామసభల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. భూపాలపల్లి 12వ వార్డు కాసీంపల్లిలో ఎమ్మెల్యేను ప్రజలు నిలదీశారు. రైతు భరోసాపై ఎమ్మెల్యేతో మాట్లాడేందుకు వెళ్తున్న రైతు కోడూరి రవిని పోలీసులు బలవంతంగా కూర్చోబెట్టారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసీల్దార్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలంలోని పాత్రాపురంలో అనర్హులైన వారి రేషన్ కార్డులు రద్దు చేయాలని, పీసా గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతూ ఏఎస్‌యూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సతీశ్ వినతిపత్రం సమర్పించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పాల్గొన్నారు. కాగా, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వాజేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గుమ్మడిదొడ్డి, పూసూరు, దూలపురంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల వద్ద వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి మధుకర్, హెల్త్‌సూపర్ వైజర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో వేదికపై కాంగ్రెస్ నాయకులు

మహాముత్తారం : మహాముత్తారం గ్రామ సభలో అధికారులతో కలిసి వేదికపై కాంగ్రెస్ నాయకులు కూర్చొని ఉండడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులను స్టేజీపై కూర్చో పెట్టుకున్న వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ కార్డు లిస్టులో రిటైర్డ్ ఉద్యోగి పేరు

కృష్ణ కాలనీ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లిలో మున్సిపల్ అధికారులు నిర్వహించిన వార్డు సభలో రేషన్ కార్డుల లబ్ధిదారుల లిస్టును సిబ్బంది చదువుతుండగా భాస్కర్ గడ్డకు చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి ముత్తే రామయ్య పేరు వచ్చింది. ప్రభుత్వ రిటైర్డ్, ప్రస్తుత ఉద్యోగులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వమని చెప్పిన అధికారులు ముత్య రామయ్య పేరును ఎంపిక చేయడంపై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామయ్యకు ప్రతి నెలా సింగరేణి నుంచి పెన్షన్ వస్తుంది. అలాంటి వారికి రేషన్ కార్డు ఎలా ఇస్తారని ప్రజలు మండిపడుతున్నారు.

రేపు జడ్పీ హైస్కూల్‌లో గ్రామ సభ

ఏటూరునాగారం, జనవరి 22 : ఏటూరునాగారంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభను ప్రజల సౌకర్యార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన వినతిపత్రానికి అధికారులు స్పందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే సభ నిర్వహించనున్నట్లు బుధవారం ప్రకటించారు. ముందుగా క్రాస్‌రోడ్డులోని గిరిజన భవన్‌లో నిర్వహించాలనుకున్నారు. గ్రామంలో అత్యధిక ప్రజలకు అది దూరంమవుతుందని, గ్రామంలోనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కాళ్ల రామకృష్ణ, దన్నపునేని కిరణ్,జాడి బోజారావు, కుమ్మరి చంద్రబాబు, బాసాని శేఖర్, తదితరులు ఎంపీడీవో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందచేశారు. దీంతో స్పందించిన అధికారులు స్థలం మారుస్తూ ప్రకటన చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కృష్ణ కాలనీ, జనవరి 22 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్‌రావు, జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ సంధాని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్, ఎస్సైలు సుధాకర్, శ్రీనివాస్, శ్రీలత, ఏఎంవీఐ సుందర్‌లాల్, శ్రీనివాస్, శిక్షణ ఎస్సై గీత, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై తాజుద్దీన్ అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

వెంకటాపూర్, జనవరి 22 : మండలంలోని జవహర్‌నగర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు బుధవారం సందర్శించి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సరైన సమయంలో టీకాలు ఇప్పించాలని సూచించారు. ఒక రోజు ముందుగానే పిల్లల లిస్టును కేంద్రానికి తీసుకురావాలని ఆశ కార్యకర్తలకు తెలిపారు. టీబీ, లెప్రసీ నియంత్రణ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చంద్రకాంత్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి మండలంలో..

మొగుళ్లపల్లి : మండలకేంద్రంలోని పీహెచ్‌సీతోపాటు ఇస్సిపేటలోని సబ్ సెంటర్‌ను భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి పీ నాగరాణి, డాక్టర్ జీ నవత, సిబ్బంది సునీత, జమున, సరిత తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో పాట చిత్రీకరణపై ఆందోళన

మహదేవపూర్(కాళేశ్వరం),జనవరి 22 : కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఇటీవల గర్భగుడిలో జానపద పాట చిత్రీకరణ విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో మధుప్రియ ఫోక్ సాంగ్ చిత్రీకరించడం సరికాదన్నారు. అధికారుల ద్వంద్వ వైఖరితో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించిన ఈవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధు ప్రియ పాటను వెంటనే తొలగించి, యూట్యూబ్ చానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు డిప్యూటీ కమిషనర్, ఆర్‌జేసీకి కూడా వివరించినట్లు తెలిపారు.

హ్యాండ్‌బాల్ క్రీడలో విద్యార్థుల ప్రతిభ

కాటారం, జనవరి 22 : రాష్ట్ర స్థాయి బాలుర జూనియర్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున పాల్గొన్న కాటారం గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు జితేందర్, వంశీ, చందర్, చంటి, చందు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారిని ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓసీ-త్రీలో చోరీకి పాల్పడిన ముఠా అరెస్ట్

గణపురం, జనవరి 22 : కేటీకే ఓసీ-త్రీలో కాపర్ వైర్ చోరీ కేసులో ఏడుగురి ముఠా సభ్యులను గణపురం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.40 వేల విలువైన వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రేఖ అశోక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పరశురాంపల్లి కేటీకే ఓసీ-త్రీలో మంగళవారం కాపర్ వైర్లు చోరీకి గురైనట్లు సింగరేణి అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఏడుగురు కనిపించడంతో వారిని సోదా చేయగా కాపర్ వైర్లు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకొని విచారించగా వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన రౌతు భరత్, పల్లపు నరసింహారావు, కల్లూరి కనకయ్య, రౌతు మల్లేశ్వరి, మక్కల రజిత, రౌతు రమాదేవి, బోదాసు చిట్టి అని తేలింది. కేటీకే ఓసీ-త్రీలో కాపర్ వైర్లను దొంగిలించి మణుగూరులో అమ్ముకునేందుకు వెళుతున్నట్లు ఒప్పుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్ రాష్ట్ర స్థాయి పోటీలకు కృష్ణ

ఏటూరునాగారం, జనవరి 22 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కే కృష్ణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇంగ్లిష్ ఒలింపియాడ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబశివరావు తెలిపారు. ములుగులో మంగళవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా కృష్ణ పాల్గొని ప్రతిభ చూపాడు. వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థి తండ్రి రంజిత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి

కాటారం, జనవరి 22 : దేశ పౌరులకు ఆధార్ కార్డు ఎలాగో ప్రతి విద్యార్థికి అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ తప్పనిసరిగా ఉండాలని డీఈవో రాజేందర్ అన్నారు. కాటారంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన అపార్ వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల డేటా నిర్వహణలో పారదర్శకత పెంచడమే కాకుండా, విద్యా డేటాను ఒకేచోట నిల్వ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఐడీ ఉండేలా అన్ని పాఠశాలలు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్లానింగ్ అధికారి రాజగోపాల్, ఎంఈవో శ్రీదేవి, ప్రిన్సిపాల్ రాజేందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

ఎన్‌క్యూఏఎస్ కింద చిన్నబోయినపల్లి సబ్ సెంటర్ ఎంపికకు కసరత్తు

ఏటూరునాగారం, జనవరి 22 : మండలంలోని చిన్నబోయినపల్లి పల్లె దవాఖాన(సబ్ సెంటర్) నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్కీం(ఎన్‌క్యూఏఎస్) కింద ఎంపిక చేసేందుకు అవకాశం రావడంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే విషయమై గురువారం సెంట్రల్ కమిటీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించనుంది. ఈ మేరకు వైద్య విభాగానికి చెందిన జిల్లా ప్రోగ్రాం అధికారి చిరంజీవి బుధవారం సెంటర్‌ను సందర్శించారు. ఇందుకు చేపట్టాల్సిన చర్యలపై వైద్యులతోచర్చించారు. వైద్యులు అభినవ్, అన్మిషా, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, మలేరియా అధికారులు పాల్గొన్నారు.

సెమినార్‌ను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నాయకులు

ములుగురూరల్/కృష్ణకాలనీ, జనవరి 22 : హైదరాబాద్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర భారత్-జాగృతి భారత్ సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ములుగులో గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కవితక్క నాయకత్వంలో నిర్వహించే ఈ సెమినార్‌లో రాజ్యాంగం అమలులో ఎదురవుతున్న సమస్యల్లో 16అంశాలపై చర్చించనునట్లు తెలిపారు. నాయకులు అంతటి రాము, నాజర్‌ఖాన్, గునిగంటి హరీశ్‌గౌడ్, చీకటి గణేశ్, గన్నేర్ల సందీప్, పాడ్య, చంటి, చర్ర, శివ, నవీన్, సందీప్, శివ, సాయి పాల్గొన్నారు. అలాగే, జాగృత భారత్ సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరుతూ భూపాలపల్లిలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజేఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చీకటి గణేశ్, జాగృతి నాయకులు సందీప్‌గౌడ్, శివప్రసాద్‌రెడ్డి, వినయ్, పవన్, ప్రదీప్, వంశీ, చందు, వెంకటేశ్, దీపక్‌జాదవ్ పాల్గొన్నారు.

దేవుడి గుట్టపై పురాతన కోట

రాతికోటపై నిర్మించిన గడిపై చెక్కిన రాజముద్ర

తాడ్వాయి, జనవరి 22 : ఏటూరునాగారం అభయారణ్యంలోని గుండ్లవాగుకు ఏడు కిలోమీటర్ల దూరంలో దేవుడిగుట్టపై పురాతన కోటను గుర్తించినట్లు సమ్మక్క,సారక్క ఆర్కియాలజీ, ఇండిజీనియస్ పరిశోధక కేంద్రం డైరెక్టర్ కాకనర్సింగరావు, అసోసియేట్ డైరెక్టర్ కొర్నిబెల్లి గణేశ్ తెలిపారు. ఈ పరిశోధన బృందం ఏడు గంటల పాటు పరిశోధనలు నిర్వహించి, పురాతన కోటలు, రాజ్య పరిపాలన, పురాతన వస్తువులను గుర్తించినట్లు తెలిపారు. గుట్ట కింద మూడు కిలోమీటర్ల విస్తరణలో కోట గడి నిర్మించారని, పురాతన శివలింగంతో పాటు నంది, నాగుపాము బొమ్మలు ఉన్న చిన్న ఆలయం ధ్వంసమై ఉందని, శిథిలాలలో ఉన్న బండరాళ్లపై లిపిని పరిశోధించగా నాలుగు పలకల బండపై నాలుగో గొట్టును తెలియజేసే గుర్తులతో పాటు రాజ్యముద్ర దీర్ఘ చతురస్ర ఆకారంలో బండపై చెక్కి ఉందన్నారు. పక్కనే బైరాం దేవుడితో పాటు మరో ఆలయం ఉందని, అక్కడి ఇప్ప చెట్టు కింద గుర్రం తలను పోలిన బండపై సమ్మక్క తల్లి ఐదో గొట్టును తెలుపడంతో పాటు నాలుగో గొట్టు కోడలు సమ్మక్క అని తెలియజేసేలా ఉన్నాయని అన్నారు. ఇది సింధు నాగరికతలో మోనో లోగో శిబబిక్ రూపంలో ఒక కొమ్ము దుప్పిని పోలి ఉన్నట్లు గుర్తించామన్నారు. నాగులమ్మ పడిగతో పాటు నెమలి ఈకలను పెట్టుకున్న స్త్రీ బొమ్మలను గుర్తించినట్లు తెలిపారు.

స్వశక్తి కరణ శిక్షణ కార్యక్రమం నిర్వహణ

గోవిందరావుపేట, జనవరి 22 : మండలంలోని చల్వాయి శివారులోని ఫంక్షన్‌హాల్‌లో తాడ్వాయి మండలంలోని కోయ కమ్యూనిటీకి సంబంధించి 22గ్రామాల గ్రామస్థాయి నాయకులకు స్వశక్తికరణ శిక్షణ కార్యక్రమాన్ని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర హాజరై గ్రామస్థాయి నాయకులు 20మంది వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ఎంఈవో కేశవరావు, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, నిరంజన్, సరస్వతి, సంజీవ, సుబ్రమణ్యం, నరసింహులు, ధనలక్ష్మీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు, జనవరి22(నమస్తేతెలంగాణ) : పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఆయన 2024 రెండో అర్ధభాగం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులతోపాటు ఓపెన్ డ్రింకింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ, ఎలక్ట్రిక్ ఫెన్స్ భద్రత సమస్యలు, భూ సమస్యల పరిష్కారం, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల నిర్మూలన, పబ్లిక్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారించాలని అన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో రాత్రి పూట, వీకెండ్లలో పోలీస్ పహారాలను పెంచాలని, పబ్లిక్ డ్రింకింగ్‌కు ప్రసిద్ధ ప్రదేశాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. హైస్పీడ్ డ్రైవింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. పల్లె ప్రాంతాల్లో రైతులకు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. వివాదాస్పద భూ సమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. మాదవక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఓఎస్‌డీ గీతే మహేశ్‌బాబా సాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు అజయ్, రమేశ్, శంకర్, రవీందర్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర రావు, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, సూరి, తిరుపతి, రాజ్‌కుమార్, వెంకటేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

భూపాలపల్లి రూరల్, జనవరి 22 : గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడానికి 23 వరకు జాబితాను అందజేయాలన్నారు. మైదానంలో పారిశుద్ధ్య.కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను ఆదేశించారు. అలాగే, ప్రజాపాలన గ్రామ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి రోజు 4 గంటల వరకు గ్రామసభల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, డీఈవో రాజేందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'మంద కృష్ణను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ములుగురూరల్/వెంకటాపూర్/వాజేడు, జనవరి 22 : మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసి, అవమానించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్‌కు బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఫిర్యాదు చేశారు. మంద కృష్ణపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఓర్వలేక తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన పసుల రామ్మూర్తి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కర్ణాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, ఉపాధ్యక్షుడు మరాఠి రవీందర్, నాయకులు ఇరుగు పైడి, తోకల రాంబాబు, దూడపాక రాజు, కార్తీక్ పాల్గొన్నారు. అలాగే, వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోరె లింగస్వామి, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు దొమ్మటి రమేశ్, గడ్డమీది సంపత్, కాడపాక రాజు, రమేశ్, శ్రీనివాస్, కిరణ్, అనిల్, అశోక్ పాల్గొన్నారు. అలాగే, వాజేడు పోలీస్‌స్టేషన్‌లో కూడా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నం స్వామి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. మండల ఉపాధ్యక్షుడు లేగల రవి, ప్రధాన కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తికాని ఆలయానికి నోటీసులు

- దేవాదాయశాఖ అధికారుల వింత పోకడ
- అధికార పార్టీ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర నిర్మించినందుకే కుట్ర..?


వేంకటేశ్వరస్వామి దేవాలయం

కృష్ణ కాలనీ, జనవరి 22 : జయశంకర్ భూపాలపల్లి మంజూరునగర్‌లో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి దేవాదాయశాఖ అధికారులు వింత పోకడ పోతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఆలయాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముందుండి నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మాత్రమే ఆగమేఘాల మీద స్వాధీనం చేసుకోవడానికి నోటీసులు అందజేయడంలో అంతర్యమేమి టో తెలియడం లేదు. ఆలయ నిర్మాణమే ఇంకా పూర్తి కా కముందే అధికార పార్టీ నాయకుల మాటలకు తలొగ్గి మూడు రోజుల్లో ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటామని దేవాదాయ శాఖ నోటీసులు జారీ చేయడం విడ్డూరంగా ఉంది. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకే ఇదంతా జరుగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నెలకు రూ.2 లక్షలపైనే ఖర్చు

ఆలయంలో ఏడాదిగా భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి శనివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హుండీని రెండు నెలలకొక్కసారి లెక్కిస్తే రూ.40 వేల నుంచి రూ. 50 వేలు మాత్రమే వస్తున్నాయి. కానీ, నిర్వహణ ఖర్చు నెలకు రూ.2 లక్షలు వస్తుంది. ఆ ఖర్చంతా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డినే భరిస్తున్నారు. అయితే, ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. విగ్రహ ప్రతిష్ఠాపన తర్వాత స్వామి వారికి నిత్యం పూజలు అందించాలని పూజారిని ఏర్పాటు చేశారు. కానీ, నిర్మాణ పనులు ఇంకా ఉన్నాయి. ప్రహరీ, రాజగోపురం, ఉత్తర ద్వార గోపురం, కల్యాణ మండపం, యాగశాల, స్టాఫ్ రూమ్, వంటశాల, ఫ్లోరింగ్, స్వామి ఆభరణాలు, పూజా సామగ్రి దాచేందుకు గదుల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఆ పనులకు సంబంధించిన పూర్తిస్థాయి మెటీరియల్ అందుబాటులో ఉంది.పనులు ప్రారంభించే సమయంలో ఎండోమెంట్ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటామని ఇబ్బందులు గురి చేస్తున్నారు. పనులు పూర్తైన వెంటనే తామే స్వయంగా టీటీడీకి లేదా దేవాదాయ శాఖకు అప్పగిస్తామని చెప్పినప్పటికీ అధికారులు వినడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. అయితే, ఆలయాన్ని ఎండోమెంట్ అధికారులు స్వాధీనం చేసుకుంటే ఆలయం అభివృద్ధి చెందుతుదా అని భక్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్వహణ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన ఇంట్లో ఉన్న బంగారం, వెండిని కరగబోసి స్వామివారికి ఆభరణాలు చేయించారు. దాతలు, తన బంధువుల సహకారంతో ఇప్పటివరకు ఆలయానికి రూ.7కోట్లు సమకూర్చి నిర్మించారు. మరో రూ. 5 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఈ నిధులను కూడా గండ్ర వెంకటరమణారెడ్డి సొంతంగా పెట్టి నిర్మించి, టీటీడీ వారికి ఇస్తామంటే ప్రభుత్వం ఒప్పుకోకుండా, ఇబ్బందుకు గురి చేస్తున్నదని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. దేవాదాయ శాఖకు అప్పగిస్తే ప్రభుత్వం నిధులు విడుదల చేయదని, నిర్మాణం పూర్తయ్యే వరకు నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలోనే ఆలయం ఉండాలని భక్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★MEDICAL SHOP STAFF (Experienced.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB-Technicians (Exp.), OT-Technicians (Exp.) Cont: Guardian Hospital, Wgl. 12 to 2 PM.
NTW-467

★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-AII

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

DOCUMENTS MISSING

My name is KOTHAPALLY SRINU, S/O SAMBAIAH R/o Potharajupally, Geesukonda Mandal, Warangal Dist. I lost my House Regd. Documents Gift Deed No. 2638/2023 while travelling from Gwmc ward office kareemabad to Potharajupally on my bike so if found please let me know Cell: 8008821132.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565